విషజ్వరాల నివారణకు అన్ని విధాలా చర్యలు

జీహెచ్‌ఎంసీ జడ్‌సీ రవికిరణ్

సికింద్రాబాద్: జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ (నార్త్) జోన్ పరిధిలో విషజ్వరాలు ప్రబలకుండా ఉండేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని జోనల్ కమిషనర్ ఎస్.రవికిరణ్ తెలిపారు. బుధవారం సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ అనుదీప్‌తో కలిసి జోనల్ పరిధిలోని పలు సర్కిళ్లలో పర్యటించి జ్వరాలు అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలను పర్యవేక్షించామన్నారు. సికింద్రాబాద్ జోన్ పరిధిలోని ముషీరాబాద్, అంబర్‌పేట్, మల్కాజిగిరి, సికింద్రాబాద్, బేగంపేట్ ఐదు సర్కిళ్లలో 859 కాలనీలు ఉన్నాయన్నారు. వీటన్నింటిలో అనారోగ్యకర పరిస్థితులను దూరం చేసేందుకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. జోన్ పరిధిలో 54 పోర్టబుల్ వాహనాలు, 11 మౌంటెడ్ మిషన్‌లను అందుబాటులోకి తెచ్చామన్నారు. అన్ని కాలనీలు, బస్తీల్లో మందులు పిచికారీ చేయడంతోపాటు, వారానికోసారి యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని చెప్పారు. విషజ్వరాల లక్షణాలు కలిగిన వారిని గుర్తించి ఇప్పటికి 124 హెల్త్ క్యాంపులు నిర్వహించామన్నారు. ముఖ్యంగా 561 పాఠశాలలు, 117 కళాశాలలు, 162 వసతి గృహాల విద్యార్థులకు వ్యాధినిరోధక చర్యల పట్ల అవగాహన కలిగించామన్నారు. కేవలం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం కోసం 200 మంది వలంటీర్లను వినియోగిస్తున్నామని జోనల్ కమిషనర్ చెప్పారు. డెంగీ నియంత్రణ కోసం అవగాహన తరగతులతోపాటు విద్యార్థులకు ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులను భాగస్వామ్యం దోమలు పెరిగే ప్రదేశాల్లో నివారణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు అందుబాటులో ఉంచేందుకు సంబంధిత అధికారులను సంప్రదిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పరంగా చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు అండగా నిలిచి విషజ్వరాల వ్యాప్తిని అరికట్టేందుకు సహకరించాలని జడ్‌సీ రవికిరణ్ కోరారు.


శానిటరీ, హెల్త్ అధికారులకు సలహాలు ఇస్తున్న జడ్‌సీ రవికిరణ్

బేగంపేట.. ట్రాఫిక్‌తో తంటా

- చిన్న ప్రమాదం, బ్రేక్‌డౌన్ అయినా స్తంభిస్తున్న ట్రాఫిక్
- కారణమేదైనా బారులుతీరుతున్న వాహనాలు



బేగంపేట ఫ్లైఓవర్‌పై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంతో స్తంభించిన వాహనాలు

సనత్‌నగర్: ఇటీవల విస్తారంగా కురిసిన వర్షాలతో బేగంపేట ప్రధాన రహదారిలోని ఓ పెట్రోల్‌బంకు వద్ద తటాకాన్ని తలపిస్తుంటుంది. దీంతో వాహనాలు ముందుకు కదల్లేని పరిస్థితి. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కేంద్రంలో కీలకంగా వ్యవహరించే వీవీఐపీ, వీఐపీలంతా బేగంపేట విమానాశ్రయం వేదికగా ల్యాండ్ అయ్యి నగరానికి వస్తుంటారు. వారి రాకపోకలతో కొన్ని నిమిషాల పాటు ట్రాఫిక్ నిలిపితే..ఆ ప్రభావం గంటల పాటు వాహనదారులపై పడుతోంది. ఈ రహదారిలో ఎక్కడైనా ప్రమాదం జరిగినా..అంతెందుకు వాహనం బ్రేక్‌డౌన్ అయినా సరే కిలోమీటర్ల మేర వాహనాలు స్తంభించి పట్టపగలే చుక్కలు చూడాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు.

ట్రాఫిక్ స్తంభించని రోజే లేదు..

నగరంలో అత్యంత రద్దీ కలిగిన ప్రధాన రహదారుల్లో ఒకటైన బేగంపేట మార్గంలో ఈ పరిస్థితులు నిత్యకృత్యం. రోజూ ఏదో ఒక చోట సమస్య తలెత్తి వాహనాలు చాంతాడంతా బారులుదీరడం పరిపాటిగా మారింది. సోమవారం మధ్యాహ్నం మణుగూరు పవర్‌ప్లాంట్‌లో ఎస్పీఎఫ్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న శంకర్‌రావు తన కుమార్తె ప్రసన్నతో కలిసి బైక్‌పై వెళ్తుండగా సరిగ్గా బేగంపేట ఫ్లైఓవర్‌పై టెంపో వాహనం ఢీకొట్టడంతో ప్రసన్న అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. ఇలాంటి ప్రమాదాలు బేగంపేట మార్గంలో ఏదో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. బేగంపేట ఫ్లైఓవర్‌పై ఎక్కువగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఫ్లైఓవర్‌తో పాటు రహదారి పొడవునా వాహనాలు నిలిచిపోవడం సర్వ సాధారణమైంది. ట్రాఫిక్ పోలీసులు సైతం ఏమి చేయలేని పరిస్థితులు నెలకొంటున్నాయి.

ట్రాఫిక్ పోలీసులపై ఒత్తిడి..

కన్ను మూసి తెరిచే లోపే వాహనాల శ్రేణి భారీగా వస్తుండటంతో ఈ రోడ్డుపై ట్రాఫిక్ నియంత్రణ చేయడం అంటే కత్తి మీద సాము లాంటిదే. ఒకవైపు ట్రాఫిక్ నియంత్రణలో తలమునకలవడంతో పాటు మరోవైపు వీవీఐపీ, వీఐపీ మూవ్‌మెంట్‌తో లా అండ్ ఆర్డర్‌తో పాటు ట్రాఫిక్ పోలీసులకూ తప్పని బందోబస్తు డ్యూటీలతో తలకు మించి భారంగా పరిణమిస్తోంది. దీనికి తోడు వరుణుడు ఉన్నట్టుండి కాస్త దంచికొడితే ఇక రహదారి చెరువును తలపించే వాహనాలు కదల్లేని పరిస్థితుల్లో ఒకానొక సందర్భంలో ట్రాఫిక్ పోలీసులు సైతం చేతులెత్తేయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

ప్రత్యామ్నాయ మార్గాలే శరణ్యం..

వాహనదారుల అవసరాలను ఇక్కడ ఫ్లైఓవర్లు, రహదారులు తీర్చలేకపోతున్నాయి. వర్షం పడినప్పుడో, లేక వీవీఐపీలు, వీఐపీల తాకిడి ఎక్కువైనప్పుడు మాత్రమే కాకుండా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఈ క్రమంలో పలు ప్రత్యామ్నాయ రహదారులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. రసూల్‌పురా చౌరస్తా నుంచి పాటిగడ్డ మీదుగా గతంలో రోడ్డును అభివృద్ధి చేయాలని నిర్ణయించినా అది ప్రతిపాదనలకే పరిమితమైందే తప్ప పట్టాలు ఎక్కలేదు. ఈ మార్గంలో ఫ్లై ఓవర్ నిర్మించడం ద్వారా పంజగుట్ట వైపు వెళ్లే వాహనదారులకు సులువవడంతో పాటు బేగంపేట రహదారిపై ఒత్తిడి తగ్గుతుంది. దీంతో పాటు పలు ప్రత్యామ్నాయ రహదారులను అన్వేషించాల్సిన అవసరం ఎంతైనా ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: కంటోన్మెంట్ తిరుమలగిరిలోని స్వయంభూ వీరభద్ర స్వామి దేవాలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో ఉండాలని వీరభద్రస్వామిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మురళి ముదిరాజ్, వీరేశం, రమేష్, రాజేందర్, రమేష్ పాల్గొన్నారు.

యాదవుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి


నీలిమకు రాధాకృష్ణుల చిత్రపటాన్ని అందజేస్తున్న చక్రధర్

సనత్‌నగర్: యాదవుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని టీపీసీసీ కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. కృష్ణాష్టమి పురస్కరించుకుని రాష్ట్ర యాదవ మహాసభ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదవ మహాసభ అధ్యక్షుడు యల్లావుల చక్రధర్ యాదవ్ ఆమెకు శాలువాతో సత్కరించి రాధాకృష్ణుల చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యాదవులు రాజకీయ, ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబీ కృష్ణయాదవ్, దుర్గమాధవి యాదవ్ పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణపై చర్యలు తీసుకుంటాం: డిప్యూటీ మేయర్


మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి

లాలాపేట: చెరువుల ఆక్రమణలపై హైడ్రా ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి తెలిపారు. బుధవారం తార్నాకలోని తన కార్యాలయంలో ఇరిగేషన్, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తమ ప్రాంతంలో ఉన్న చెరువుల, నాలాల ఆక్రమణలతో వర్షాకాలంలో వచ్చే వరదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. అక్రమ నిర్మాణాలు, చెరువుల ఆక్రమణలపై ఫిర్యాదులు వస్తే వాటిని హైడ్రా దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా అధికారులు చొరవ తీసుకోవాలని డిప్యూటీ మేయర్ సూచించారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమష్టిగా చెరువులపై సర్వే చేయాలని కోరారు. ఈ సమావేశంలో మోతె శోభన్‌రెడ్డి, మారేడుపల్లి తహసీల్దార్ భీమయ్య గౌడ్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ తదితరులున్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పద్మారావునగర్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ హేమలత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం హమాల్‌బస్తీ బస్తీ దవాఖానాను ఆమె సందర్శించి అక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులతో ప్రజలు ఆస్పత్రులకు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొందని సకాలంలో మెరుగైన వైద్య సేవలను అందించాల్సిన బాధ్యత వైద్యులు, సిబ్బందిపై ఉందన్నారు. కార్పొరేటర్ వెంట కుషా, కౌసల్య, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.


మందులు అందజేస్తున్న హేమలత

ప్రత్యేక పూజలు


వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలోని త్రీ స్టార్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా బుధవారం జరిగిన ప్రత్యేక పూజలకు సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండపంలో ప్రతిష్ఠించిన కృష్ణుడి విగ్రహం వద్ద ఎమ్మెల్యేను వేడుకల నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు సుంకు రాంచందర్, త్రీ స్టార్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు బొగ్గుల కృష్ణ, చెన్నయ్యగౌడ్, భాస్కర్‌రావు, అశ్విన్ కుమార్, వైవీ బాలాజీ, నాయిని ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా ఉండటమే 'విన్' లక్ష్యం


ఛానల్ ప్రారంభోత్సవంలో అలోక్ రుంగ్తా

సనత్‌నగర్: జీవిత బీమా అవకాశాలను అందిపుచ్చుకునేలా మొట్టమొదటిసారిగా మహిళల నేతృత్వంలో విమెన్ ఇన్ ఇన్సూరెన్స్ (విన్) సేల్స్ ఛానల్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని ఫ్యూచర్ జెనరాలి ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్ సీఈఓ అలోక్ రుంగ్తా అన్నారు. బేగంపేటలోని ఆ సంస్థ కార్యాలయంలో విన్ డిజిటల్ సేల్స్ ఛానల్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జీవిత బీమా రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, వాటిపై పూర్తిస్థాయి అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ డిజిటల్ ప్లాట్‌ఫాంను ప్రారంభించామన్నారు. ఇది పూర్తిగా మహిళల నేతృత్వంలో కొనసాగుతుందన్నారు. ముఖ్యంగా యువతులను ఇందులో భాగస్వామ్యం చేస్తూ వారికి అండగా నిలబడాలన్నదే విన్ ముఖ్య ఉద్దేశం అన్నారు.

'గాంధీ'లో రోగి ఆత్మహత్యాయత్నం


భవనంపై నుంచి దూకేందుకు యత్నిస్తున్న పరుశురామ్


సురక్షితంగా తీసుకొచ్చిన అవుట్‌పోస్ట్ పోలీసులు

కాపాడిన సెక్యూరిటీ సిబ్బంది

గాంధీఆస్పత్రి : మానసిక రుగ్మతలతో బాధపడుతున్న ఓ రోగి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి భవనంపై నుంచి కిందికి దూకేందుకు యత్నించగా, సెక్యూరిటీ సిబ్బంది కాపాడారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరికి చెందిన పరశురామ్ (35) కొంతకాలంగా మానసిక రుగ్మతలతో పాటు అస్వస్థతకు గురై గాంధీ ప్రధాన భవనం మూడో అంతస్తులోని జనరల్ మెడిసిన్ విభాగంలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం మొదటి అంతస్తులో నుంచి కిందికి దూకేందుకు యత్నిస్తున్నాడు. గమనించిన సెక్యూరిటీ సిబ్బంది పరుశురామ్‌ను మాటల్లో పెట్టి వెనుక నుంచి వెళ్లి సురక్షితంగా కిందికి తీసుకొచ్చారు. అనంతరం గాంధీ అవుట్ పోస్ట్ పోలీసులకు అప్పగించగా కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. చాకచక్యంగా వ్యవహరించి, రోగి ప్రాణాలు కాపాడిన సెక్యూరిటీ సిబ్బందిని ఆస్పత్రి ఉన్నతాధికారులు, జీడీఎక్స్ సంస్థ ప్రతినిధి రవికుమార్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శివాజీ అభినందించారు.

ఓయూ ఎకానమిక్స్ నూతన హెడ్‌గా ప్రొ.సుధాకర్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఎకానమిక్స్ హెడ్‌గా ప్రొ.సుధాకర్ రెడ్డి, ఎంబీఏ హెడ్‌గా ప్రొ.జహంగీర్ నియమితులయ్యారు. గతంలో వివిధ పదవులు చేపట్టిన వీళ్లుగా హెడ్‌గా రెండు సంవత్సరాలు పదవుల్లో కొనసాగనున్నారు.

వితరణ



చిలకలగూడ: తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ ఆధ్వర్యంలో సీతాఫల్‌మండి శ్రీనివాసనగర్ సంఘ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పట్టు చీర, నగదు వితరణగా అందించారు. సంఘ సభ్యులైన రంగరాజు శ్రీనివాస్, సునీతల కుమార్తె సాయిభార్గవి వివాహానికి తమవంతు సాయంగా పట్టుచీరతోపాటు రూ.10,500 నగదు అందించినట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. మున్నూరుకాపు సంఘం సికింద్రాబాద్ ప్రెసిడెంట్ చేపూరి వెంకటేశ్వరరావు, యువక మండలి అధ్యక్షుడు హరీష్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో పీడీఎస్‌యూ 50వ ఆవిర్భావ సభ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఠాగూర్ ఆడిటోరియంలో పీడీఎస్‌యూ 50వ ఆవిర్భావ సభను నిర్వహించనున్నారు. అక్టోబరు 24న రెండు పీడీఎస్‌యూల ఆధ్వర్యంలో జరిగే సభకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరుకావాలని విద్యార్థి నేతలు నాగరాజు, మహేష్ తెలిపారు. నవంబరులో సీపీఐఎంఎల్-న్యూ డెమోక్రసీ రెండు విప్లవ పార్టీలు ఏకం అవుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విప్లవ పార్టీలకు అనుబంధంగా పని చేస్తున్న రెండు పీడీఎస్‌యూలు ఐక్యత దిశగా కొనసాగుతూ 50వ ఆవిర్భావ దినోత్సవాన్నినిర్వహించనున్నట్లు వివరించారు.

ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

సనత్‌నగర్: వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని బేగంపేట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రామయ్య అన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో వినాయక మండప నిర్వాహకులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు. అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే మండపాలను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్, ఫైర్‌కు సంబంధించి రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్సవాలు ప్రారంభం నాటి నుంచి ముగిసే వరకు నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలజడులు సృష్టించాలనే ప్రయత్నిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు గంగాధర్, జయచందర్, శ్రీరాములు, వరలక్ష్మీ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బేగంపేట డివిజన్‌కు చెందిన 28 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఆడపడుచుల పెళ్లికి ఆర్థిక భారం కాకూడదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా ఆర్థిక సహాయం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీహరి, ఆరీఫ్, అఖిల్ పాల్గొన్నారు.

మెడికల్ కోడింగ్‌లో ఉచిత శిక్షణపై అవగాహన


కరపత్రాలు పంపిణీ చేస్తున్న అప్సా టెక్ మహీంద్రా ఫౌండేషన్ ప్రతినిధులు

అడ్డగుట్ట: నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు అప్సా టెక్ మహీంద్రా ఫౌండేషన్ కృషి చేస్తోందని సెంటర్ సమన్వయకర్త పురుషోత్తం అన్నారు. బుధవారం తుకారాంగేట్‌లోని సుభాష్ విగ్రహం వద్ద అప్సా టెక్ మహీంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించి శిక్షణకు దరఖాస్తులను స్వీకరించారు. సెంటర్ సమన్వయకర్త పురుషోత్తం మాట్లాడుతూ.. నాలుగు నెలల పాటు ఇచ్చే శిక్షణలో 20-28 ఏళ్ల వయస్సు గల యువత అర్హులని తెలిపారు. ఇందులో మెడికల్ టర్మినాలజీ, హ్యూమన్ అనాటమి, ఫిజియాలజీ, ఆర్‌సీఎం, బేసిక్ బిల్లింగ్ టర్మినాలజీ, ఎంఎస్ ఆఫీస్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి వాటిలో శిక్షణ అందించనున్నట్లు వివరించారు. బీఎస్సీ, ఎమ్మెస్సీ, బీఫార్మా, ఎంఫార్మా, బీకామ్, ఎంకామ్ విభాగాలలో ఉత్తీర్ణులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 91549 90132, 91549 90130లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీ టీచర్ ప్రీతి, మొబిలైజేషన్ కోఆర్డినేటర్ ఆదర్శ్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు ప్రొ.యాదవరెడ్డి కన్నుమూత


ప్రొ.యాదవరెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ఓయూ ఆర్ట్స్ కాలేజీ ప్రొ. ఎం.యాదవరెడ్డి (94) కన్నుమూశారు. నల్గొండ జిల్లాలో 1930లో జన్మించిన ఆయన నిజాం నవాబు పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు జరిపిన సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. ఓయూ విద్యార్థిగా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఆయన ఆర్ట్స్ కాలేజీలో ఎకనామిక్స్‌లో ఎంఏ, పీహెచ్‌డీ పూర్తి చేసి అధ్యాపకులుగా 1955లో ఉద్యోగంలో చేరాడు. ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందిన అనంతరం 1986-88 వరకు ఆర్ట్స్ కాలేజీకి 9వ ప్రిన్సిపాల్‌గా పని చేశారు. అనంతరం ఆరు సంవత్సరాలు ఎకనామిక్స్ విభాగం హెడ్‌గా, 1988-1990 వరకు సోషల్ సైన్స్ డీన్‌గా పదవీలో కొనసాగి ఉద్యోగ విరమణ చేశారు. హబ్సిగూడ్ స్ట్రీట్ నంబర్.7లో నివాసం ఉంటున్న ప్రొ.యాదవరెడ్డి అనారోగ్యంలో బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ఎగ్జామినేషన్ కంట్రోలర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

విటమిన్-డీ లోపంతోనే వెన్ను, మెడ నొప్పులు


మాట్లాడుతున్న డాక్టర్ భక్తియార్ చౌదరి

అమీర్‌పేట: విటమిన్-డీ లోపంతోనే వెన్ను, మెడ నొప్పులు వస్తాయని ప్రముఖ స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణులు ప్రొఫెసర్ మేజర్ డాక్టర్ భక్తియార్ చౌదరి అన్నారు. అమీర్‌పేట గ్రీన్‌పార్క్ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెన్ను నొప్పికి గల కారణాలను ముందుగానే గుర్తించి చికిత్స చేయించుకోవాలని లేకుంటే రోజువారి కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ప్రతీ చిన్న సమస్యకు శస్త్ర చికిత్సల వరకు వెళ్లడం మంచిది కాదన్నారు. జనన లోపాలు, పార్శ్వగూని, కేన్సర్లు, కణితులు, గాయం వంటి సమస్యలకు చిన్నపాటి శస్త్ర చికిత్సలు అవసరమన్నారు. దేశ వ్యాప్తంగా 20-50 ఏళ్ల లోపు స్త్రీలలో 79 శాతం మంది దీర్ఘకాలిక నొప్పితో బాధపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రధానంగా సమయానికి ఆహారం తీసుకోవాలని, సూర్యరశ్మి శరీరానికి తగిలేటట్లు చూసుకోవాలన్నారు. ఆహారం ద్వారా 20, సూర్యరశ్మి ద్వారా 80 శాతం డీ-విటమిన్ లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి విజయరావు, వెన్నునొప్పి బాధితురాలు శాంతివాసి రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం


వీహెచ్‌పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

బౌద్ధనగర్: పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి 18వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ చైర్మన్ ఎల్. గోపాల్ జెండా ఆవిష్కరించారు. అనంతరం చైర్మన్ గోపాల్‌రావు, వైస్ చైర్మన్ అందే రాంబాబు మాట్లాడుతూ.. తెలంగాణలోని వికలాంగులందరూ వికలాంగుల పెన్షన్ అయిన రూ.6 వేల కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నవంబర్ 26న ఇందిరా పార్క్ కేంద్రంగా వేలాది మంది వికలాంగులు చలో హైదరాబాద్‌కు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జాతీయ నాయకులు మున్నూరుకాపు సూరి, జిల్లా అధ్యక్షులు టీవీ. నరసింహారావు, డప్పు మల్లికార్జున్, నర్సింగ్‌రావు, రామకృష్ణ, శ్రీనివాస్, ప్రభాకర్, శివప్రసాద్, బాబు, ప్రవీణ్, గాంధీ, అరుణ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

రుతుచక్ర విధానంపై విద్యార్థినులకు అవగాహన

లాలాపేట: లాలాపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాల(మార్కెట్ స్కూల్)లో బుధవారం బ్లూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెన్‌స్ట్రువల్ హైజిన్ హెల్త్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ సందర్భంగా రుతుచక్ర విధానంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. రుతుస్రావం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినులకు వివరించారు. రుతుస్రావం ఆలస్యమైతే తల్లిదండ్రుల ద్వారా వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం 360 మంది విద్యార్థినులకు సానిటరీ ప్యాడ్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లూ ఫౌండేషన్ ప్రతినిధులు పార్వతి, సుమతీ, నీలిమా, స్కూల్ ఇన్‌చార్జి అనురాధ, యాక్షన్ ఎయిడ్ ప్రోగ్రాం ఆఫీసర్ వందన, కో ఆర్డినేటర్ మౌనిక తదితరులున్నారు.

డిగ్రీ విద్యార్థులకు ఆర్‌బీఐ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: రిజర్వ్‌బ్యాంక్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) 90వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించే క్విజ్ పోటీలకు ఓయూ డిగ్రీ విద్యార్థులు పాల్గొనవచ్చు అని రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ బుధవారం తెలిపారు. నాలుగు స్థాయిలలో జరిగే ఆన్‌లైన్ క్విజ్ పోటీలో మొదటి రౌండ్‌లో డిగ్రీ విద్యార్థులందరూ పాల్గొనవచ్చు. మొదటి రౌండ్‌లో విజేతలు రెండో రౌండ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొనేందుకు అర్హులు, రాష్ట్ర స్థాయి విజేతలు మూడో రౌండ్‌లో జోనల్ స్థాయిలో పోటీ పడాల్సి ఉంటుంది. జోనల్ రౌండ్ విజేతలు జాతీయ స్థాయిలో జరిగే గ్రాండ్ ఫైనల్ పోటీ పడాలి, విజేతలకు నగదును బహుమతి అందజేయనున్నారు.

మజ్దూర్ యూనియన్‌లో చేరిన సంఘ్ నేతలు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ డివిజన్‌కు చెందిన పలువురు దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్‌కు చెందిన నాయకులు బుధవారం మజ్దూర్ యూనియన్‌లో చేరారు. సికింద్రాబాద్‌లోని యూనియన్ కార్యాలయంలో యజ్దూర్ యూనియన్ కార్యదర్శి రవీందర్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సంతోష్, సుధాకర్, లక్ష్మణ్‌ల నేతృత్వంలో పలువురు ప్రతినిధులకు తమ యూనియన్‌లో చేర్చుకున్నారు. రమేశ్‌కుమార్, శ్రీపతి, నరసింహారెడ్డి, ఎలందర్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం

రాంగోపాల్‌పేట్: చికిత్స కోసం నగరానికి వచ్చిన ఓ మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైన ఘటన మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..సిద్దిపేట జిల్లా, చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మామిళ్ల రమణమ్మ (40) బంధువులతో కలిసి సోమవారం నగరానికి వచ్చింది. బుధవారం ఉదయం స్విమ్మింగ్‌పూల్ బస్టాండ్ వద్ద ఎర్రగడ్డ ఆస్పత్రికి వెళ్లేందుకు వచ్చారు. ముందుగా ఆ మహిళ కొండాపూర్ వెళ్లే బస్సు ఎక్కగా ఆమెతో పాటు వచ్చిన వాళ్లు ఎక్కలేదు. అంతలోపే బస్సు వెళ్లిపోయింది. ఆమె కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహిళ ఆచూకీ తెలిస్తే 8712661253 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.